క్లుప్తంగా

గాండ్లగూడెంలో బోనాల ఉత్సవాలు



బోనమెత్తిన గ్రామ మహిళలు, యువతులు, చిన్నారులు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గాండ్లగూడెం గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం బోనాల ఉత్సవాలను నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువతులు బోనాలను తలపెట్టుకొని ప్రదర్శన నిర్వహించి ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు సమర్పించారు. బోనాల ఉత్సవాలతో గ్రామంలో సందడి నెలకొనగా.. కాంగ్రెస్ మహిళా నాయకురాలు మాలోతు సునీత, మాజీ సర్పంచ్ భూక్య చిలకమ్మ, మహిళా భక్తులు భూక్య పావని, భూక్య లక్ష్మి పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

బూర్గంపాడు: బూర్గంపాడులోని గౌతమిపురానికి చెందిన పున్నమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యఖర్చులకు ఆర్థికంగా ఆమె కుటుంబం ఇబ్బందులు పడుతుండగా.. మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ గురువారం పున్నమ్మ వైద్యఖర్చులకు రూ 4వేల ఆర్థికసాయాన్ని అందించింది. రిటైర్డ్ ఏఎస్ఐ సత్యనారాయణ రూ.3వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కైపు లక్ష్మీనారాయణరెడ్డి, కైపు నాగిరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, పుట్టి రాజేష్, గాదె నర్సిరెడ్డి, కొండ్రు వెంకటేశ్వర్లు, బిజ్జం వెంకట్రామిరెడ్డి, సెనగ మల్లేశ్వరరావు, భూపెల్లి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు ప్రాంతానికి చెందిన పత్తిపాక బాలకృష్ణ-సత్యవతి దంపతులు, వారి కుమారుడు అన్వేష్‌కుమార్-అనూష దంపతులు, మనువడు హరిపృథ్వీ, మనువరాలు ఈశలు ఆలయంలోని సాయినాథుడిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం పత్తిపాక బాలకృష్ణ కుటుంబ సభ్యులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాత బాలకృష్ణ దంపతులను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశ వరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ సందర్శన

అశ్వారావుపేటరూరల్: స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పవర్ ప్లాంట్‌ను గురువారం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ అధికారులతో మాట్లాడి ప్లాంట్ వివరాలు, విద్యుత్ ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో మాజీ సీఎం కేసీఆర్ అశ్వారావుపేట నియోజకవర్గానికి అన్ని విధాలుగా అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. అదనపు ఫ్యాక్టరీ, అప్పారావుపేట ఫ్యాక్టరీతో పాటు రూ.36 కోట్ల వ్యయంతో పవర్ ప్లాంట్‌ను మాజీ సీఎం మంజూరు చేశారని తెలిపారు. అనంతరం పవర్ ప్లాంట్ సందర్శనకు వచ్చిన జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయిల్ ఫెడ్ డీఓ బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ నాగబాబు, మాజీ ఎంపీపీ శ్రీరామ్మూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు సత్యవరపు సంపూర్ణ, వె ంకన్న బాబు, మోటూరి మోహన్ పాల్గొన్నారు.

‘డీలర్లకు వరంగా రేషన్ బియ్యం’

బూర్గంపాడు: ఆహార భద్రత పథకం కింద ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యం డీలర్లకు వరంగా మారిందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నంచంద్ ఆరోపించారు. గురువారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ షాపులలో ఇచ్చే దొడ్డు బియ్యం తినటానికి బాగుండకపోవటంతో చాలామంది వాటిని రేషన్ డీలర్లకే తక్కువ ధరలకు విక్రయిస్తున్నారన్నారు. లబ్ధిదారుల వద్ద నుంచి కిలో రూ.8 నుంచి రూ.10 వరకు డీలర్లు కొనుగోలు చేసి, వాటిని రైస్ మిల్లర్లకు రీసైక్లింగ్ కోసం రెట్టింపు ధరలకు అమ్ముతున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ నిఘా పెట్టి ఆయా డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సద్దుల సంబురాలు

తొమ్మిది రోజులు ఆటపాటలతో కొనసాగిన బతుకమ్మ సంబురాలు చివరిరోజు గురువారం ముగిశాయి. రంగు రంగుల తీరొక్క పూలతో అందంగా బతుకమ్మను పేర్చి మహిళలంతా ఊరేగింపుగా ముఖ్య కూడళ్ల వద్దకు తీసుకువచ్చారు. బతుకమ్మ పాటలతో అర్ధరాత్రి వరకు ఆటలు ఆడారు. అనంతరం పోయిరా బతుకమ్మ.. మళ్లీరా గౌరమ్మ అంటూ అందుబాటులోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. కాగా, ఆయా ప్రాంతాల్లోని కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: సుందరయ్యనగర్‌లోని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



చర్ల: బతుకమ్మలను పేర్చి పూజలు చేస్తున్న మహిళలు



గుండాల: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కరకగూడెం: బతుకమ్మతో బాలిక



మణుగూరుటౌన్: భద్రాద్రి స్టేడియంలో బతుకమ్మలతో సింగరేణి జీఎం, సేవా విభాగం ప్రతినిధులు



కరకగూడెం: భట్టుపల్లిలో బతుకమ్మలతో మహిళలు, యువతులు



గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడులో..



అశ్వాపురం: మల్లెలమడుగులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కరకగూడెంలో బతుకమ్మ వద్ద చిన్నారి

పోలీసుల ముమ్మర తనిఖీలు



జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ పరిధిలోని పాన్ షాపులు, కిరాణా షాపులలో నిషేధిత గంజాయి మత్తు పదార్థాలు గుర్తించడానికి పోలీస్ జాగిలంతో గురువారం తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలతో గురువారం భద్రాచలం పట్టణ పరిధిలోని బస్టాండ్, పాన్‌షాప్‌లు, కిరాణ షాప్, మొదలగు ప్రాంతల్లో తనిఖీలు చేపట్టినట్లు టౌన్ సీఐ సంజీవరావు తెలిపారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలానే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధించిన గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే ఉంటే ప్రజలు వెంటనే డయల్ 100 లేదా 8712682106 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

తండ్రి కలను నెరవేర్చిన కుమార్తె



నియామకపత్రం అందుకుంటున్న హరిత

మణుగూరురూరల్: తండ్రి సాధించలేని కలను ఓ కుమార్తె నెరవేర్చింది. మణుగూరు ప్రాంతానికి చెందిన మారబోయిన లింగయ్య తన చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయుడు కావాలన్న లక్ష్యంతో విద్యనభ్యసించారు. అనుకోని పరిణామాల క్రమంలో లింగయ్య ఎల్ఐసీ ఏజెంట్‌గా చేస్తూ.. కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన తండ్రి లింగయ్య కలను సాకారం చేసేందుకు కుమార్తె హరిత ఎంతోకష్టపడింది. ఫలింగా తాజా డీఎస్సీ పరీక్షలో ఎస్‌జీటీ ఉపాధ్యాయ వృత్తికి ఎంపికైంది. నియామక పత్రాన్ని అందుకుంది. కుమార్తె ఎంపికవడంపై తండ్రి లింగయ్య ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

మంత్రి తుమ్మలకు ఆహ్వానం

దమ్మపేట: అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో నూతనంగా నిర్మించిన పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సిందిగా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులతో కలసి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. గురువారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మలను, ఎమ్మెల్యే జారే, ఆయిల్ ఫెడ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 12(శనివారం) దసరా పండుగ రోజున అశ్వారావుపేటలో పవర్ ప్లాంటు ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ అధికారులు శ్రీకాంత్ రెడ్డి, బాలకృష్ణ, పామాయిల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ అలపాటి రామచంద్ర ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, బండి భాస్కర్, మొగళ్లపు చెన్నకేశవరావు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి, యర్రా వసంతరావు, ఎస్‌కె.పాషా తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

బోనస్ చెల్లించాలని వినతి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కూడా ప్రత్యేక ప్రోత్సాహక బోనస్ రూ.5వేలను చెల్లించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఏరియా ఎస్ఓటూ జీఎం డి.శ్యాంసుందర్, ఏరియా ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్‌లకు గురువారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ మాట్లాడుతూ.. సింగరేణి వార్షిక లాభాలలో సోలార్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు కూడా భాగస్వాములేనని తెలిపారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు చల్లా కాంతారావు, వెంకటేశ్వర్లు, ఎం.కృష్ణ, దేవేందర్, టెక్నీషియన్లు సతీష్, ఈశ్వర్ సాయి పాల్గొన్నారు.

ఉపకరణాల ఎంపిక శిబిరం



దివ్యాంగులను ఎంపిక చేస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో అర్టిఫిషియల్ లింబ్ మాన్యుఫ్యాక్షరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగుల సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 126 మంది దివ్యాంగులను బ్యాటరీ ట్రైసైకిళ్లు, ట్రైసైకిళ్లు, వీల్ చైర్‌లు, వినికిడి యంత్రాలు, అంధుల చేతికర్రలు, కృత్రిమ అవయవాలు, చంకకర్రలు కోసం ఎంపిక చేశారు. గురువారం జరిగిన శిబిరానికి హాజరు కాలేని దివ్యాంగులు నేడు పాల్వంచలో ఉన్న ఐడీఓసీ కార్యాలయం వద్ద జరిగే దివ్యాంగుల ఎంపిక శిబిరానికి హాజరు కావొచ్చునని సంబంధిత అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, సీడీపీఓ నవ్య శ్రీ, అలింకో సిబ్బంది రష్మి, అభిషేక్ ద్వివేది, సూపర్‌వైజర్లు సౌమ్య, అనసూర్య, రాజేశ్వరి, వర ప్రసాద్, నరేష్, ప్రవీణ్, అంగన్‌వాడీలు, దివ్యాంగులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో లక్ష్యాల సాధన

మణుగూరుటౌన్: ఉత్పత్తి లక్ష్యం ఎంత పెద్దదైనా సమష్టి కృషితో సునాయాసంగా సాధించవచ్చని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. గురువారం మధ్యాహ్నం ‘ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర’పై అవగాహన కార్యక్రమం ఏరియా వర్క్‌షాప్‌లో నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో 2023–24 వార్షిక లక్ష్యమైన 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 100శాతం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని కార్మికులు, ఒప్పంద కార్మికులకు సహపంక్తి భోజనాల కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. సింగరేణి భవిష్యత్‌లో నిర్వహించబోయే నూతన విధానాలపై ఉద్యోగులందరికీ బొగ్గు గనులపై, సోలార్ విద్యుత్, పంప్ స్టోర్, పవర్ ప్లాంట్, ఇతర వ్యాపార విస్తరణ అంశాలపై ఉద్యోగులకు పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు అన్ని యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్మికులకు భోజనం వడ్డిస్తున్న ఏరియా జీఎం, అధికారులు, కార్మిక నాయకులు

ఉత్సవాలకు రథం వితరణ

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఐటీసీ పీఎస్‌పీడీ ఉద్యోగులు తమ గ్రామానికి చేయూతగా నిలుస్తున్నారు. గ్రామంలోని దేవాలయాల్లో జరిగే ఉత్సవాలకు దేవుని ఊరేగింపు కోసం రూ.2.50లక్షల వ్యయంతో రథాన్ని గురువారం బహూకరించారు. ఆరేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఐటీసీ ఎంప్లాయిస్ బస్టాఫ్ నిర్మాణానికి ఆర్థిక చేయూతనందించారు. ఆ తరువాత గ్రామానికి అవసరమైన ఫ్రీజర్‌బాక్స్ (శీతల శవపేటిక)ను అందించారు. ఇప్పుడు దేవుని రథం అందించి దాతృత్వం చాటుకుంటున్నారు.



బూర్గంపాడు: గ్రామానికి రథం బహూకరిస్తున్న నాగినేనిప్రోలు ఐటీసీ ఉద్యోగులు

ఆదివాసులకు దోమతెరలు..

కరకగూడెం: ‘ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్’ సభ్యుడు, కరకగూడెం గ్రామీణ వైద్యుడు షేక్ సోందుపాషా ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పద్మాపురం పంచాయతీ పరిధిలోని నీలాద్రిపేటలో గ్రామస్తులకు సుమారు 70 దోమ తెరలను అందజేశారు. కరకగూడెం ఎస్సై రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పద్మాపురం గ్రామస్తులు పఠాన్ యాకుబ్ ఖాన్, ఈసం రాజబాబు ఫౌండేషన్ సభ్యులు షేక్ వసీం అక్రం, సమీర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరకగూడెం: దోమ తెరలు అందజేస్తున్న ఎస్సై రాజేందర్

అడ్డగోలు దిగుమతులతో ఇక్కట్లు



పట్టణంలో ప్రధాన రోడ్డుపైనే దిగుమతి చేస్తున్న దృశ్యం

మణుగూరుటౌన్: నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే మణుగూరు పట్టణంలో వరంగల్–కొత్తగూడెం ప్రధాన రహదారిపై అడ్డగోలుగా పెద్దఎత్తున సామగ్రి దిగుమతి చేయడం ప్రమాదకరంగా మారుతోంది. మణుగూరు మండల కేంద్రంతో పాటు బీటీపీఎస్ బొగ్గు, సింగరేణికి, బీటీపీఎస్‌కు రావాల్సిన ప్రధాన వస్తువులు, మణుగూరు సెంటర్‌లో ప్రయాణికులు, పాదచారుల, వివిధ ప్రాంతాల నుంచి మణుగూరుకు వచ్చే ఆటోలతో రద్దీ ఉండటం సహజం. దసరా, బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో రద్దీ మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, విజయవాడ నుంచి రిటేయిల్ దుకాణాలకు తీసుకువచ్చే ట్రాన్స్‌పోర్ట్‌లు మాత్రం అవేవీ పట్టనట్లుగా నడిరోడ్డుపైనే దిగుమతులు చేస్తూ ప్రయాణికుల, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మణుగూరులోని కొన్ని ట్రాన్స్‌పోర్టులు ఊరి చివరన అన్‌లోడ్ చేసి చిన్న వాహనాల ద్వారా సరుకును తరలిస్తుండగా.. ఊరి చివరణ ఉన్న ఒక ట్రాన్స్‌పోర్ట్ మాత్రం ఇలా రోజుకు మూడు నుంచి నాలుగు లారీలను పండుగ, జన సంచారం, వాహనాల రద్దీని పట్టించుకోకుండా ఒకే రోడ్డుపై దిగుమతి చేస్తోంది. మరో రోడ్డుపై ఉన్న దుకాణాలకు కూడా ఇక్కడ నుంచే సరుకును హమాలీల ద్వారా తరలిస్తోంది. ఇలా ప్రమాదాలకు కారకులవుతుండటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టానురీతిగా వ్యవహరిస్తూ ప్రయాణికులు, పాదచారులు, ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై పోలీసులు, మున్సిపాలిటీ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిజ రూపంలో అమ్మవారు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాలు, మండపాల్లో అమ్మవారికి పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం అమ్మవారు భక్తులకు నిజరూపం దుర్గా దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు ఆలయాల్లో చండీ హోమాలను వేద పండితులు, అర్చకులు శాస్త్రోత్తంగా నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: అమ్మవారిని దర్శించుకుంటున్న సీఐ సతీష్‌కుమార్, తదితరులు



భద్రాచలంటౌన్: దుర్గా దేవి అలంకరణలో అమ్మవారు



మణుగూరురూరల్: దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న తహసీల్దార్ రాఘవరెడ్డి



దమ్మపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



చంద్రుగొండ: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు



అశ్వారావుపేటరూరల్: దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు